రంగు లిప్‌స్టిక్ వేసుకుంది. ఒకసారి చూస్తే ఇంకోసారి చూడ బుద్ధి వెయ్యదు. ఆ ప్రక్కనే లలిత ముఖానికి ఒక్క పిసరు మేకప్పు లేకుండా ఇంకా నాజూకుగా ఇంకా అందంగా మెరసిపోతూంది. నాలాగే రమేశూ, సుందరం కూడా ఇద్దర్నీ మార్చి మార్చి చూడ్డం గమనించాను.

ఇంకొంచెంసేపులోను రమేశు స్నేహితురాలు మాలతి వచ్చింది. మరీ తెల్లటి తెలుపుగాదు. నలుపూగాదు. సరిక్రొత్త ఫేషన్లో ముడి వేసుకుంది. లేత గులాబీ రంగు పెదిమలకి రంగు, లేత గులాబీ షెకీన్ చీర. అదే రంగు స్లీవ్‌లెస్ చోళీ వేసుకుంది. లోపలికి వెళ్తూంటే, వీపు కన్పడింది. వీపు మీద జాకెట్టు ఉందా లేదా అన్నట్లుంది. అంత లో జాక్. ప్రస్తుతం మాడల్‌లాగా వున్నా, ఒక పిల్లని కనే సరికి ఒక రుబ్బురోలు పొత్రంలా అయిపోతుందని చూసేవారికి అన్పిస్తోంది.సభ్యత కూడా తెల్సినట్లు లేదు. పార్టీ జరుగుతున్నంతసేపు ఆమె చూపు మాధురీ త్రాగుతున్న జిన్ మీదే వుండింది. లలిత మెల్లగా ఆ పిల్ల వివరాలు కనుక్కొని కబుర్లు చెపుతోంది. ఒక్క పాట పాడమంది. ఆ పిల్ల రాదంది. రమేశు మాత్రం ఆ పిల్లనీ, మాధురినీ, తల్లినీ, తండ్రినీ మార్చి మార్చి పెద్ద పెద్ద కళ్ళతో చూస్తూన్నాడు. ఆ కళ్ళలో ఏదో తొట్రుపాటు కన్పడింది.

పార్టీ అయ్యేసరికి మాధురికి ఒంటిమీద స్పృహే లేదు. ఆడాళ్ళిద్దర్ని డ్రాప్ చేయమంటానని లలిత డ్రైవరుని కేకేసి వాళ్ళిద్దర్నీ పంపించింది. లలిత ఇంకా బయటే వుంది.

లలిత ఈ మాధురని ఎందుకు పిల్చిందీ, అని నాకు అర్థంగాలేదు. నేను ఆలోచిస్తూంటే, సుందరం నాతో అన్నాడ "నేను లలితని చేసుకోవడం నా అదృష్టం! ఈ మాధురికి ఆనాటినుంచీ చెడ్డ అలవాట్లున్నాయి. అంతా నా అదృష్టం," అంటూంటే రమేశు విన్నాడు. వింటూ నిట్టూర్చాడు మెల్లగా తన గదిలోకి వెళ్ళిపోయాడు.

లలితతో చెప్పి నేనూ బయల్దేరాను.

మర్నాడు హౌరాలో మెద్రాసుకి వెళ్ళే ట్రైనులో ఫస్టుక్లాసులో ఎక్కాను. ఆ కంపార్టుమెంటులోనే రమేశూ ఎక్కాడు స్టేషనుకి వచ్చిన లలితా, సుందరంలతో మాట్లాడుతూ కూర్చున్నాను. రమేశు ఇంటర్వ్యూకి అని వాత్తేరుకి వెళ్తున్నాడు.

లలిత కళ్ళలో మొన్న కనపడ్డ వెలితి లేదు. ఆ నవ్వులో గర్వం తృప్తి రెండూ వున్నాయి. సుందరం కూడా ఏదో ఆపద గట్టెక్కిన వాడిలా వున్నాడు. రమేశుకి టాటా చెప్పి, లలిత కేసి చూస్తున్న సుందరం కళ్ళల్లో గర్వం, ఆరాధనా రెండు కన్పించాయి.

ట్రైను బాగా వేగం అందుకున్నాక రమేశుని చూసాను. ఆ పిల్లాడికి నాతో ఏదో చెప్పాలని ఆత్రంగా ఉందని గ్రహించి, మెల్లగా అడిగాను. "నిన్న మీయింటికి వచ్చి నమ్మాయి శాంతినికే

